అన్నదానం



కాచిగూడ: ఆర్యవైశ్య సంఘం నింబోలిఅడ్డ ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెంట్రల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ ముఖ్యఅతిథిగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అల్లాడి సుధాకర్‌గుప్తా, కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, బాలరాజ్, శ్రీకాంత్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయడానికి ముందుండాలి

అంబర్‌పేట: యువత రక్తదానం చేయడానికి సేవా భావంతో ముందుండాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.గౌతంరావు కోరారు. సేవా పక్షంలో భాగంగా డివిజన్ బీజేపీ అధ్యక్షుడు శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం గోల్నాకలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అమృత, నాయకులు అజయ్‌కుమార్, మూల రవీందర్‌గౌడ్, నర్సింగ్ యాదవ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'ఘంటసాల అమృత గాన లహరి'

కాచిగూడ: అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో 'ఘంటసాల అమృత గాన లహరి' కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. స్వర సమ్రాట్ డాక్టర్ టి.శరత్ చంద్ర స్వర సారథ్యంలో జరిగిన ఈ వేడుకలో పలువురు గాయనీ, గాయకులు ఘంటసాల పాటలు పాడి అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో కొక్కుల దేవేందర్, పద్మశాలి సంఘం నేతలు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీహెచ్‌ఆర్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సతీష్

కాచిగూడ: ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ (ఏఐసీహెచ్‌ఆర్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మొగిలి సతీష్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ... తాను చేపట్టిన కార్యక్రమాలను గుర్తించి రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించిన జాతీయ నాయకులు, రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం, సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం

ముషీరాబాద్: మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. ఆదివారం మిలాద్-ఉన్-నబీ జయంతిని పురస్కరించుకుని ముషీరాబాద్ డివిజన్ పఠాన్‌బస్తీలో 'మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర'పై సదస్సు నిర్వహించారు. మహ్మద్ లియాకత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహ్మద్ జహంగీర్, ఖదీర్, వాసీం, హాజామ్, యూనాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక శోభ!

- శారదాంబ మూల విరాట్‌కు మహాభిషేకం
- జగత్ ప్రసూతిక అలంకణలో దర్శనమిచ్చిన శారదాంబ
- నేడు బ్రాహ్మి అలంకరణ, కలశ స్థాపన

శంకరమఠంలో శారదా శరన్నవరాత్ర మహోత్సవాలు ప్రారంభం

నల్లకుంట: నల్లకుంటలోని శంకరమఠంలో ఆదివారం శారదా శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శారదాంబ మూల విరాట్‌కు మహాభిషేకం చేశారు. అలాగే భక్తులకు అమ్మవారి హరిద్ర (పసుపు అలంకరణ) దర్శనం లభించింది. అనంతరం శారదాంబ జగత్ ప్రసూతిక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు కలిగించింది. అలాగే ఉదయం జగద్గురు శ్రీచంద్రశేఖర భారతీ మహాస్వామి ఆరాధన నిర్వహించారు. అమ్మవారి హరిద్రా దర్శనం కోసం పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదానం జరిగింది.



జగత్ ప్రసూతిక అలంకరణలో దర్శనమిస్తున్న శారదామాత



న్యూ రామాలయంలోని జ్ఞానసరస్వతి మాత



భవానీదేవి

నేడు బ్రాహ్మి అలంకరణ, కలశ స్థాపన..

శరన్నవరాత్ర ఉత్సవాల్లో సోమవారం శారదాంబ బ్రాహ్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తుందని మఠం ధర్మాధికారి చింతలపాటి శ్రీనివాస మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం కలశ స్థాపన ఉంటుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం 'దేవీ భాగవతం' ప్రవచనం ఉంటుందన్నారు.

నేటి నుంచి విశాల్ నవరాత్రి మహోత్సవ వేడుకలు

కాచిగూడ: జై భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు బర్కత్‌పుర చమన్ వద్ద విశాల్ నవరాత్రి మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం బర్కత్‌పురలోని నవరాత్రి వేడుకల మండపం వద్ద వారు మీడియాతో మాట్లాడారు. వేడుకల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 7.30గంటలకు అన్నదానం, సాయంత్రం గర్బా, దాండియా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

నల్లకుంట: న్యూనల్లకుంటలోని శ్రీసీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో సోమవారం(నేడు) నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శ్రీ జ్ఞానసరస్వతి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ఇందు కోసం దేవాదాయ శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ ఉత్సవాల్లో 11 రూపాల్లో అమ్మవారు దర్శనమిస్తారని ఆలయ ఈఓ కె.జయంతి, పాలక మండలి చైర్మన్ గోపాల్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా 11 రోజుల పాటు ఉదయం సరస్వతి మాతకు అభిషేకం, కుంకుమార్చనలు, హారతి, మంత్రపుష్పం, సప్తశతి పారాయణాలు, చండీహోమం ఉంటుందన్నారు.

భవానీశంకర ఆలయం ముస్తాబు

ముషీరాబాద్: భోలక్‌పూర్ దేవునితోటలోని 400 సంవత్సరాల చరిత్ర గల భవాని శంకర ఆలయంలో సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతున్నాయి ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్‌కుమార్, దేవాదాయ శాఖ ఈవో జ్యోతి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శరన్నవరాత్రి మహోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

కట్టమైసమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

కవాడిగూడ: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ గౌతమ్ కుమార్ పటేల్, ఆలయ ఈవో కె. సాంబశివరావులు తెలిపారు. ఆదివారం శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ప్రతి ఒక్కరూ అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపను పొందాలన్నారు. ఈ సమావేశంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ సతీష్, ప్రధాన అర్చకులు సాత్విక్ శర్మ, రాజేష్ శర్మ , సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కట్టమైసమ్మ ఆలయ ప్రతినిధులు

బతుకమ్మకుంట కలను సీఎం నెరవేర్చారు



నల్లకుంటలో బతుకమ్మతో ఇంటింటికీ వెళ్లి మహిళల ఆహ్వానిస్తున్న వీహెచ్



పోచమ్మ ఆలయ ప్రాంగణంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేసిన వీహెచ్

26న బతుకమ్మ కుంట ప్రారంభోత్సవానికి రావాలి: వీహెచ్

నల్లకుంట: ఎన్నో ఏళ్ల ప్రజల బతుకమ్మకుంట కలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నెరవేర్చారని మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతారావు అన్నారు. ఆదివారం నల్లకుంట డివిజన్ మాజీ కార్పొరేటర్ గరిగంగి శ్రీదేవి రమేష్ ఆధ్వర్యంలో బతుకమ్మ కుంట ప్రారంభ వేడుకల ఆహ్వాన పత్రికల పంపిణీ చేపట్టారు. దీనికి హాజరైన వీహెచ్ మాజీ కార్పొరేటర్లు గరిగంటి శ్రీదేవి రమేష్, దిడ్డి రాంబాబు, పులి జగన్, పి. నారాయణ స్వామి తదితరులతో స్థానిక పోచమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలతో కలిసి వీహెచ్ బతుకమ్మ ఆడారు. అనంతరం పెద్ద ఎత్తున బతుకమ్మలతో వచ్చిన మహిళలతో కలిసి స్థానికంగా ఇంటింటికి తిరిగి ఈ నెల 26న నిర్వహించే బాగ్అంబర్‌పేట బతుకమ్మ కుంట ప్రారంభోత్సవ వేడుకలకు రావాలని కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. గత 35 ఏళ్ల పోరాట ఫలితంగా అంబర్‌పేట నియోజక వర్గంలో కబ్జాకు గురైన బతుకమ్మ కుంటను బతికించుకున్నామని అన్నారు. బతుకమ్మ కుంట ప్రారంభోత్సవానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వస్తారని, మహిళలు పెద్ద ఎత్తున హాజరైన ముఖ్య మంత్రికి ఘన స్వాగతం పలకాలని కోరారు. బతుకమ్మ కుంటను బతికించడానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ న్యాయ పోరాటం చేశారన్నారు. అందుకు ఆయనకు వీహెచ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో హాజరైన బతుకమ్మ ఆట, పాటలతో సందడి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గరిగంటి రమేష్, లక్ష్మణ్ యాదవ్, జేవీ శ్యామ్‌రావు, మురళీకృష్ణ, రామ్మోహన్‌రావు, భగవాన్ పాల్గొన్నారు.

దేవీ నవరాత్రి వేడుకల్లో డీజేను నిషేధించాలి

కాచిగూడ: దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో డీజేను పూర్తిగా నిషేధించాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్ లక్ష్మణ్‌రావు ప్రభుత్వాని విజ్ఞప్తి చేశారు. ఆదివారం కాచిగూడలోని బజరంగ్ సేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎం.మనోజ్‌కుమార్, నరేష్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు విరుద్ధంగా ఈవెంట్ల పేరుతో దేవి శరన్నవరాత్రి వేడుకల్లో పాశ్చాత్య సాంస్కృతిని, డీజే సాంగ్స్‌తో అశ్లీల నృత్యాలను చేయిస్తూ తమ వ్యాపారాభివృద్ధికి వాడుకుంటున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దాండియా, గర్బాల పేరుతో ఇతర మతాలకు చెందిన ఈవెంట్ ఆర్గనైజర్లు కార్యక్రమాలను నిర్వహిస్తూ హిందూ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు.

దాండియా ఈవెంట్లలో హిందుయేతరులను అనుమతించొద్దు..

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో డీజేలను పూర్తిగా నిషేధించి ఎలాంటి అల్లర్లు జరగకుండా శాంతియుత వాతావరణంలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు జరిగేలా చూడాలని ఆయన పోలీసు కమిషనర్లు, ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ వేడుకల్లో టెక్నీషియన్ నుంచి బౌన్సర్ల వరకు అందరూ హిందువులే ఉండేలా చూడాలన్నారు. ఈవెంట్లలో హిందుయేతర వ్యక్తులు చొరబడి హిందూ సంస్కృతిని నాశనం చేస్తున్నారని అన్నారు. ఈవెంట్‌కు హాజరయ్యే మహిళలతో సహా ప్రతి ఒక్కరిని చెక్ చేసి పంపించాలని సూచించారు. రాత్రి 12 గంటలలోపు వేడుకలు పూర్తయ్యే విధంగా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.



కాచిగూడలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్ లక్ష్మణ్‌రావు

అసమానతలపై సామాజిక ఉద్యమం చేపట్టాలి



కేవీపీఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎండీ అబ్బాస్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక అసమానతలపై ఉద్యమం చేపట్టాలని అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబ్బాస్ పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాలలో అశాస్త్రీయ భావనలు, మత విద్వేషాలు పేట్రేగిపోతున్నాయని అన్నారు. ఆదివారం చిక్కడపల్లిలోని కేవీపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో సోషల్ మీడియాపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ... కుల అసమానతలు పెంచి పోషించే విధంగా సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్నారని అన్నారు. దేశం అభివృద్ధి పథంలో నడవాలంటే యువత ఇలాంటి వాటిని తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, కోటా గోపి, పిట్టల రవి, సుందర్, మల్కయ్య, బాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ కోరారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా పఖ్వాడాలో భాగంగా ఆదివారం అశోక్‌నగర్‌లో ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు దేశ వ్యాప్తంగా అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండగోని భరతగౌడ్, వినయ్‌కుమార్, రమేష్‌రామ్, నవీన్‌కుమార్, రత్నసాయిచంద్, దామోదర్, శ్రీకాంత్, సురేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



అశోక్‌నగర్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ నేతలు

వైఎంసీఏ, క్రైస్తవ సంస్థల ఆస్తుల కబ్జాను మానుకోవాలి

కవాడిగూడ: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఇతర కాంగ్రెస్ పెద్దలు వైఎంసీఏ,క్రైస్తవ సంస్థల ఆస్తుల కబ్జాను మానుకోవాలని వైఎంసీఏ క్రైస్తవ సంస్థల ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరూసలెం మత్తయ్య డిమాండ్ చేశారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద క్రైస్తవ సంస్థల ఆస్తులను కబ్జాను మానుకోవాలని ఆయన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జెరూసలేం మత్తయ్య మాట్లాడుతూ... దశాబ్ద కాలంగా కులమతాలకు అతీతంగా పేదలకు సేవ, క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్న నారాయణగూడ, సికింద్రాబాద్ వైఎంసీఏ సభ్యులపై అక్రమ బైండోవర్ కేసులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైఎంసీఏ వ్యక్తిగత సొసైటీ గొడవలను సాకుగా చూపుతూ నగర పోలీసులు మతోన్మాద చర్యలుగా తప్పుదోవ పట్టించి ఇరు వర్గాలపై బైండోవర్ కేసులు నమోదు చేయడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. నేడు సీసీ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జరగాల్సిన సమావేశాన్ని రద్దు చేసుకొని వైఎంసీఏ సభ్యులకు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీజీపీ కార్యాలయం ఎదుట దళిత క్రైస్తవ సంఘాలు, పాస్టర్ ఫెలోషిప్, వైఎంసీఏ అభిమానులను కలుపుకొని భారీ ఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



రోడ్డు ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సదస్సులో మాట్లాడుతున్న జీవన్ సాహు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి జీవన్ సాహు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర సదస్సులో జీవన్ సాహు మాట్లాడుతూ... దేశ స్థూల జాతీయోత్పత్తిలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న కార్మికులను ప్రభుత్వాలు గాలికి వదిలేశాయని విమర్శించారు. నేషనల్ క్రైమ్ రిపోర్ట్ బ్యూరో ప్రకారం2024వ సంవత్సరంలో 31వేలకు పైగా రోడ్డు ప్రమాదంలో చనిపోయారని ప్రతి 17 నిమిషాలకు ఒకరు మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సరుకులను, ప్రజలను రవాణా చేయడంలో 80 శాతం పైగా రోడ్డు రవాణా ద్వారా జరుగుతోందన్నారు. అందుకే రోడ్డు రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 106 (2) చట్టాన్ని సవరించాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వీరయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు, మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, అజయ్ బాబు, వీరాంజనేయులు, కోటయ్య, కల్లూరి మల్లేషం, బాషా, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన తేజం కొండా లక్ష్మణ్ బాపూజీ..



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పింస్తున్న దుర్గయ్యగౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బహుజన తేజం కొండా లక్ష్మణ్ బాపూజీ అని బీసీ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.దుర్గయ్యగౌడ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర నాయకులు అయిలి వెంకన్నగౌడ్ అన్నారు. ఆదివారం చిక్కడపల్లిలోని ఫ్రంట్ కార్యాలయం స్వాతంత్ర్య సమర యోధులు, తొలితరం ఉద్యమకారులు కొండా లక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతి సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రత్యేక రాష్ట్ర సాధనకై తన మంత్రి పదవిని సైతం తృణ ప్రాయంగా త్యాగం చేసిన మహనీయుడని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా జల దృశ్యంలో తన ఇల్లును కార్యాలయానికి అంకితం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైరు శేఖర్, భిక్షపతి చారి, కేవీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శివం రోడ్‌లో..

అంబర్‌పేట: ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి ఆదివారం శివం రోడ్‌లోని అంబర్‌పేట పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి సంఘం నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వర్కాల కృష్ణ, ఉపాధ్యక్షులు గంగిశెట్టి సత్తయ్య, దామోదర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలి..

కవాడిగూడ: స్వాతంత్ర్య సమర యోధులు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కలలు కన్న సామాజిక తెలంగాణ ఆశయ సాధనకు కృషి చేయాలని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంబటి సుధాకర్ గంగపుత్ర పిలుపునిచ్చారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణతో పాటు కొండా లక్ష్మణ్ బాపూజీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న అంబర్‌పేట పద్మశాలి సంఘం నాయకులు



బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అంబటి సుధాకర్

పరామర్శ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకురాలు మరియా భర్త ఇటీవల మృతి చెందారు. కాగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ యువజన నాయకులు ముఠాజైసింహ ఆదివారం మరియా నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శంకర్ ముదిరాజ్, మన్నె దామోదర్ రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఎస్‌ఎఫ్ మహాసభను జయప్రదం చేయాలి

ఎన్‌డీఎస్‌ఎఫ్ చైర్మన్ కృష్ణస్వరూప్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి (ఎన్‌డీఎస్‌ఎఫ్) 5వ వార్షికోత్సవ మహాసభను జయప్రదం చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఎన్‌డీఎస్‌ఎఫ్ చైర్మన్ వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ... నిమ్న జాతుల నాయకత్వంలో పనిచేస్తున్న వివిధ రాజకీయ పార్టీలు, విప్లవ కమ్యూనిస్టు పార్టీలు, కుల ప్రజా ఉద్యమ సంస్థల ఆధ్వర్యంలో ఎన్‌డీఎస్‌ఎఫ్ ఏర్పడిందన్నారు. మనువాద దోపిడీ, కుల మాఫీయా రాజకీయ పక్షాలకు ప్రత్యామ్నాయంగా ఫ్రంట్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. బాషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 26న జరిగే ఈ మహాసభకు పెద్ద ఎత్తున తరలి వచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. త్వరలో జరగబోయే జూబ్లిహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో తమ ఫ్రంట్ తరుపున పోటీ చేయిస్తామని తెలిపారు.

బతుకమ్మ సంబరాలు

బతుకమ్మ సంబురాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని మహిళలు ఎంగిలిపూల బతుకమ్మను రంగురంగుల పూలతో తయారు చేసి పూజలు చేశారు. అనంతరం ఇరుగుపొరుగు వారితో కలిసి బతుకమ్మ ఆడారు. గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజించి బతుకమ్మను నీటిలో వదిలారు. బతుకమ్మలను రూపొందించుకుని సందడిగా ఆడిపాడారు.
– అంబర్‌పేట



పటేల్‌నగర్ సరస్వతి పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు



ప్రేమ్‌నగర్‌లో హైమవతి పాఠశాలలో బతుకమ్మ సంబురాలు



భోలక్‌పూర్ పద్మశాలి కాలనీలో..



బతుకమ్మ ఆడుతున్న కార్పొరేటర్ సుప్రియ



బీఆర్‌ఎస్ భవన్‌లో.. కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి



చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, మహిళలు



గ్రీన్ రిచ్ రెసిడెన్సీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు



భోలక్‌పూర్ మహాత్మానగర్‌లో..